సాక్షి
గుంటూరు
మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



అభివృద్ధి పనులు పరిశీలన
తాడేపల్లిరూరల్: కంఠంరాజు కొండూరు గ్రామంలోని మహంకాళీ అమ్మవారి దేవస్థాన అభివృద్ధి పనులను సోమవారం దేవదాయ శాఖ ఉప కమిషనర్ కె.జి.శ్రీనివాస్ పరిశీలించారు.



పులిచింతల నీటి నిల్వ
అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 30,722 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 33,543 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 588.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 10,120 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

డీటీసీగా సీతారామిరెడ్డి బాధ్యతల స్వీకారం



పట్నంబజారు: రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా సోమవారం కె.సీతారామిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. స్వర్ణభారతీనగర్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో ఆయన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. విజయవాడ డీటీసీగా పనిచేస్తున్న ఆయన్ను సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరుకు బదిలీ చేశారు. ఇప్పటి వరకు డీటీసీగా విధులు నిర్వర్తించిన షేక్ కరీం ఏలూరుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీతారామిరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు.

పవర్ లిఫ్టింగ్‌లో జ్ఞాన దివ్యకు పతకాలు




తెనాలి రూరల్: దక్షిణాఫ్రికాలో ఆదివారం జరిగిన కామన్వెల్త్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెనాలి మండలం కఠెవరం గ్రామానికి చెందిన నాగం జ్ఞానదివ్య ప్రతిభ కనబర్చారు. ఆమె 84 ప్లస్ జూనియర్ విభాగంలో నాలుగు కాంస్య పతకాలు సాధించారు. స్క్వాట్‌లో 160 కిలోలు, బెంచ్ ప్రెస్‌లో 55 కిలోలు, డెడ్ లిఫ్ట్‌లో 157.5 కిలోల బరువు ఎత్తారు. మొత్తం 372.5 కిలోల బరువులను ఎత్తి నాలుగు కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా నాగ దివ్యను కోచ్ కొల్లిపర నాగశిరీష, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కోమాకుల విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని, గ్రామస్తులు అభినందించారు.

నేటి నుంచి రైతుబజార్లలో టమాటా కిలో రూ.50

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలోని అన్ని రైతు బజార్లలో మంగళవారం నుంచి కిలో టమాటా రూ.50కే విక్రయాలు జరపనున్నట్లు మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు బి.రాజబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.65 నుంచి రూ.90 వరకు పలుకుతోందని పేర్కొన్నారు. దీంతో ఇతర జిల్లాల నుంచి టమాటాలను కొనుగోలు రాయితీపై రైతుబజార్లలో విక్రయించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని వెల్లడించారు. ఒక్కొక్కరికీ కిలో చొప్పున అమ్ముతారన్నారు. పట్టణ ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 8004 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 330, బ్యాంక్ కెనాల్‌కు 1820, తూర్పు కెనాల్‌కు 693, పశ్చిమ కెనాల్‌కు 235, నిజాంపట్నం కాలువకు 453, కొమ్మమూరు కాలువకు 3380 క్యూసెక్కులు వదిలారు.

యార్డుకు 44,193 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 44,193 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 39,293 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.8,500 నుంచి రూ. 16,300 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.8,000 నుంచి 18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకానికి రూ. 9,500 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకానికి రూ. 8,000 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 23,929 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

కొత్త మద్యం పాలసీలో తిరకాసు

- కార్పొరేషన్ లిమిట్స్‌కు దగ్గరగా మండల, పంచాయతీ పరిధి ఉంటే వాత
- మద్యం షాపునకు కార్పొరేషన్ లైసెన్స్ ఫీజు చెల్లించాల్సిందే..
- 10 వేలలోపు జనాభాకు రూ.50 లక్షలు లైసెన్స్ ఫీజు
- షాపు కార్పొరేషన్ పరిధికి దగ్గరగా ఉంటే రూ.85 లక్షలు తప్పదు
- అధికారులు చెబుతున్న నిబంధనలు చూసి వెనకడుగు వేస్తున్న దరఖాస్తుదారులు
- పల్నాడు జిల్లాలో ఏడు షాపులకు అందని దరఖాస్తులు



నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ఖజానా నింపేందుకు అడ్డదారులు తొక్కుతోంది. ప్రజల నడ్డివిరిచే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. దీనికి కొత్త మద్యం పాలసీని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. గత ప్రభుత్వం మద్యం కట్టడి చర్యల్లో భాగంగా ప్రైవేట్ మద్యం దుకాణాలను రద్దు చేసింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించింది. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంతా తారుమారైంది. జిల్లాల్లో మద్యం ఏరులా పారించేందుకు కొత్త మద్యం పాలసీని ఈ నెల 1వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చింది. ప్రైవేట్ వ్యక్తులకు దుకాణాల్ని కట్టబెట్టి కాసులు దండుకునే పనిలో పడింది. కొత్త మద్యం పాలసీ ద్వారా వేల కోట్ల రూపాయిల్ని ప్రజల నుంచి రాబట్టేందుకు కుట్ర పన్నింది.

లైసెన్స్ ఫీజు మోత...

కొత్త మద్యం పాలసీలో భాగంగా నాలుగు రకాల శ్లాబులను అందుబాటులోకి తెచ్చింది. 10వేల జనాభాలోపు రూ.50లక్షలు, 50వేల జనాభాలోపు రూ.55లక్షలు, 5లక్షల జనాభాలోపు రూ.65లక్షలు, 5లక్షలు జనాభా దాటితే రూ.85లక్షలు ఏడాది ప్రభుత్వానికి దుకాణనిర్వాహకులు చెల్లించాలి. దీంతో పాటు రెండు సంవత్సరాల కాలపరిమితితో రూ.2లక్షల(నాన్ రిఫండబుల్) ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి డిపాజిట్ చేయాలి. రెండో ఏడాది ప్రస్తుతం ఉన్న ఫీజుకు కంటే అదనంగా 10శాతం చెల్లించాలి. ఈ లెక్కన రూ.85లక్షలు మొదటి సంవత్సరం లైసెన్స్ ఫీజు ఉంటే, రెండో సంవత్సరం 93,50,000 కట్టాలి. వీటన్నంటినీ తలొగ్గి షాపు దక్కించుకుందామంటే ఎక్సైజ్ శాఖ అధికారులు బాంబు పేల్చారు. వాస్తవానికి మండల పరిధి, పంచాయతీ పరిధి, కార్పొరేషన్ లిమిట్స్ పరిధి ఐదు కిలోమీటర్లు దగ్గరగా ఉంటే రూ.50లక్షలు ఫీజు కట్టాలి. ఇప్పుడు లైసెన్స్ ఫీజు రూ.85లక్షలు కట్టాల్సిందేనని చెబుతున్నారు. ఉదాహరణకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో బుడంపాడు ఒక భాగమే ! అయితే, బుడంపాడు పక్కనే నారాకోడూరు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మామూలుగా అయితే నారాకోడూరులో రూ.50లక్షలు లైసెన్స్ ఫీజు చెల్లిస్తే సరిపోతుంది.కానీ మున్సిపల్ కార్పొరేషన్‌కు దగ్గరగా ఉండటంతో దుకాణం పెట్టాలంటే రూ.85లక్షలు లైసెన్స్ ఫీజు చెల్లించాల్సిందేనని తేల్చి చెబున్నారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.65లక్షలు లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. తాడేపల్లి పక్కనే విజయవాడ నగరపాలక సంస్థ ఉంది. ఈ లెక్కన తాడేపల్లి నుంచి విజయవాడకు ఐదు కిలోమీటర్ల దాటిన తరువాతే షాపు పెట్టుకోవాల్సి ఉంటుంది. ఐదు కిలోమీటర్లలోపు ఉంటే రూ.85లక్షలు కట్టాల్సిందే అని అధికారులు చెబుతున్నారు. దీంతో చాలా మంది షాపులకు దరఖాస్తు చేసుకోవాలంటే భయపడుతున్నారు.

స్టేట్, నేషనల్ హైవేస్ దగ్గరగా వీల్లేదు

జిల్లా వ్యాప్తంగా చాలా మండలాలు, గ్రామాలు నేషనల్, స్టేట్ హైవేస్‌కు దగ్గరగా ఉంటాయి. అయితే హైవేస్‌కు దగ్గరగా మద్యం షాపులకు పెట్టడానికి వీల్లేదని ఎక్సైజ్ అధికారులు తేల్చి చెబుతున్నారు. హైవేస్ దగ్గరగా ఉండే మండలాల్లో 20వేల లోపు జనాభా ఉంటే 220 మీటర్ల లోపలకు దుకాణం ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. 20వేల పైగా జనాభా ఉంటే హైవే నుంచి 500 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసుకోవాలని నిబంధనలు పెట్టారు .

పల్నాడులో పలు షాపులకు ఇంకా అందని దరఖాస్తులు

గుంటూరు జిల్లాలో 127 షాపులకు 1200 దరఖాస్తులు, పల్నాడు జిల్లాలో 129 షాపులకు 644 దరఖాస్తులు అందాయి. ఇంకా ఏడు షాపులకు అందలేదు. ప్రభుత్వం కొత్త పాలసీ వల్ల తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని దరఖాస్తుదారులు వాపోతున్నారు. కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌తో పాటు పలు ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న మద్యం పాలసీ విధానాల అధ్యయనం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల్ని పంపించింది. అయితే, అధికారులు ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న పాలసీ విధానాలను ప్రభుత్వానికి వివరించినప్పటికీ పాత పద్ధతికే రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు చూపిందని తెలుస్తోంది. గతంలో ఏదైతే అమలులో ఉందో(మున్సిపల్ కార్పొరేషన్ ఐదు కిలోమీటర్ల పరిధి) దాన్నే అమలు చేస్తూ.. తామేదో కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చామని ప్రభుత్వం చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందంటూ దరఖాస్తుదారులు విమర్శిస్తున్నారు.

అవసరమైన పరిమాణంలో ఇసుక

- దళారులను నమ్మి మోసపోవద్దు
- జిల్లాకలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
- టోల్ ఫ్రీ నెం 0863 - 2234201

తెనాలి: గుంటూరు జిల్లాలో అవసరం మేరకు ఇసుక అందుబాటులో ఉందని, ప్రజలు ఎవ్వరూ దళారులను నమ్మి అధిక ధరకు కొనుగోలు చేయవద్దని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా రవాణా చేసేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఉచిత ఇసుక విధానంపై జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ , తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహాతో కలసి మాట్లాడారు. జిల్లాలో ఇసుక విధానంపై ప్రజలకు, కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు చాలా అపోహలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం తాళ్లాయపాలెం స్టాక్ యార్డు నుంచి రెగ్యులర్‌గా అమ్మకాలు చేస్తున్నామని తెలిపారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో బుక్ చేసుకున్నవారికి సరఫరా ఉంటుందనీ, రోజుకు 3500 టన్నుల ఇసుక పంపిణీ చేస్తున్నామని తెలిపారు. తాళ్లాయపాలెం స్టాక్ యార్డ్‌ను మరో వారంలో మూసివేస్తామని చెప్పారు. ఇప్పటికే కొల్లిపరలో మూడు, బొమ్మువానిపాలెంలో రెండు, మున్నంగి, గుండిమెడలో ఒక్కోచోట ఓపెన్ రీచ్‌లను గుర్తించామన్నారు. వీటికి పర్యావరణ అనుమతులు ఇప్పటికే ఉన్నాయని, మాన్యువల్‌గా ఇసుక తవ్వడానికి అనుమతి ఉందని చెప్పారు. ఈ రీచ్‌ల నుంచి అక్టోబర్ 16 వ తేదీ నుంచి ఇసుక అందించడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. వీటిలో మొత్తం 2,92,245 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక ఉందని గుర్తించామన్నారు. ఇందులో భాగంగా అక్టోబర్ 16వ తేదీ నాటికి స్టాక్ యార్డు, పోచ్ బోర్డు, స్టాక్ యార్డు నుంచి మాన్యువల్‌గా త్రవ్వి లోడ్ చేయడానికి సంబంధించి ఏజెన్సీ ఫైనలైజేషన్ తదితర అంశాలు పూర్తి చేస్తామన్నారు. ఇందులో భాగంగానే టెండర్స్ పిలుస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో నెలకు సుమారు 90 వేల మెట్రిక్ టన్నుల అవసరమని చెబుతూ ఆ ప్రకారం మరో మూడు నెలలకు సరిపడా ఇసుక అందుబాటులో ఉందని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టా భూముల్లో ఇసుక డీకాస్టింగ్‌కు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని, ఇందుకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియ త్వరలోనే ఆరంభిస్తామని చెప్పారు. ఎవరైతే పట్టా భూములు డీ కాస్టింగ్ చేయడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటారో వాటిని డీఎల్ఎస్‌ఈ ద్వారా వెరిఫికేషన్ చేసి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అనుమతి మంజూరు చేస్తామన్నారు. ఇసుక కావలసిన వారు పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలని, సొంత వాహనం కలిగిన వారికి ఇసుక స్లాట్ ఇస్తామని, అక్కడకు వెళ్లి తెచ్చుకోవాలన్నారు. సొంత వాహనం లేని వారికి ప్రభుత్వమే సమకూర్చుతుందని, వారు రవాణా చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఇసుక సరఫరాలో ఫిర్యాదులు జిల్లా కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నెం 0863 – 2234201కు చేయవచ్చని, రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ కు కూడా ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి. వేదికపై ఎస్పీ సతీష్‌కుమార్, సబ్‌కలెక్టర్ సంజనాసింహ

రంగస్థల తొలి పద్మభూషణుడు ఏఆర్. కృష్ణ

నేడు తెనాలిలో వీణా అవార్డ్స్–2024 వేదికపై ప్రఖ్యాత రంగస్థల నటుడు ఏఆర్. కృష్ణ జాతీయ రంగస్థల పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల కళాకారుడు యడ్ల గోపాలరావుకు ప్రదానం చేస్తున్న సందర్భంగా...



ఏఆర్. కృష్ణ



యడ్ల గోపాలరావు

తెనాలి: నటుడు, దర్శకుడు, ప్రయోక్త ఏఆర్. కృష్ణ ఆధునిక తెలుగు సామాజిక నాటకానికి ఆద్యులు. నాటకోద్యమమే ఊపిరిగా జీవించారు. ప్రపంచ నాటకంలో మార్పుల కనుగుణంగా ఎన్నో ప్రయోగాలు చేశారు. జానపద కళలకు ఊపిరి పోశారు. నాట్య విద్యాలయంతో ఎందరినో తీర్చిదిద్దారు. రాష్ట్ర ప్రభుత్వ నాటక విద్యాసంస్థ, నటమండలి (రిపర్టరీ)కి అధ్యక్షుడిగా, దర్శకుడిగా రంగస్థల అభివృద్ధికి జీవితకాలం కృషి చేశారు. ఆయన పూర్తిపేరు అడుసుమిల్లి రాధాకృష్ణశాస్త్రి. వేమూరు మండలం పెరవలిలో 1926 నవంబరు 13న జన్మించారు. హైదరాబాద్‌లో ఎల్ఎంఈ చదివి, రాష్ట్ర విద్యుత్ బోర్డులో సూపర్‌వైజరుగా చేరారు. 1945 ప్రాంతంలో నాటకరంగాన్ని కార్యక్షేత్రంగా చేసుకున్నారు. 'ఇండియన్ నేషనల్ థియేటర్'తో నాటక ప్రదర్శనల వెల్లువను సృష్టించారు. ఢిల్లీలోని భారతీయ నాట్యసంఘం సంయుక్త కార్యదర్శిగా ఎంపికయ్యారు. లండన్ డ్రామా లీగ్ నుంచి అధ్యాపక పట్టా పొందారు. ఫోర్డ్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌తో అమెరికాలో నాటకరంగ అధ్యయనం చేశారు.

ప్రతి జిల్లాకు నాట్య సంఘం విస్తరణ

1954లో ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘాన్ని ఏఆర్. కృష్ణ స్థాపించి, దాని శాఖల్ని ప్రతి జిల్లాకు వ్యాపింపజేశారు. కన్యాశుల్కం, వీలునామా, రామదాసు, మాలపల్లి వంటి నాటకాలను, మరాఠీ, బెంగాలీ, కన్నడ, తమిళ, మలయాళం భాషల్లోని ఉత్తమ నాటకాలను అనువదింపజేసి, ప్రదర్శింపజేశారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రదర్శనను ఢిల్లీ నాటకోత్సవాలకు పంపుతూ వచ్చారు. తోలుబొమ్మలాటను పునరుద్ధరించి, ఫ్రాన్స్, జర్మనీ, పోలెండ్‌లో ప్రదర్శింపజేశారు. తెలుగు జానపద కళలకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చారు. యక్షగానానికి రంగస్థలంపై ప్రాణప్రతిష్ట చేశారు. తన సంపాదకత్వంలో వచ్చిన 'రంగస్థల శాస్త్రం' తెలుగులో నాటక విద్యా బోధనకు పెద్ద బాలశిక్ష.

నటీనటులకు శిక్షణ

నటీనటులకు శిక్షణ ఆవశ్యకతను గుర్తించి, అందుకు బలమైన పునాది వేశారు. సంస్కృత ప్రకరణం 'మృచ్ఛకటికం'ను తెలుగు వ్యావహారిక భాషలో ప్రదర్శించారు. చారిత్రాత్మక 'ప్రతాపరుద్రీయం'లో తాను పేరిగాడిగా నటించి, దర్శకత్వం వహించారు. కుందుర్తి వారి 'ఆశ'తో కవితా నాటక ప్రయోగం చేశారు. శ్రీశ్రీ 'విదూషకుడి ఆత్మహత్య'తో అధివాస్తవికవాద రూపకాన్ని ప్రయోగించారు. 'మాలపిల్ల' నాటకాన్ని హైదరాబాద్‌లో వరుసగా 40 రోజులు ప్రదర్శించటమే కాదు...ఒకేచోట 12 రంగస్థలాలపై ప్రదర్శింపజేయడం మరో విశేషం. 'ఆత్మవంచన' వంటి నాటకం ప్రదర్శనలతో భావితరానికి మార్గనిర్దేశనం చేశారు. శ్యామ్‌బెనగల్ 'అనుగ్రహం', మృణాల్‌సేన్ 'ఒక ఊరికథ' సినిమాల్లో నటించారు.

నాటకాభివృద్ధికి విశేష కృషి

రాష్ట్ర సంగీత నాటక అకాడెమీ సభ్యుడిగా, యునెస్కో అంతర్జాతీయ నాటక సంస్థ సభ్యుడిగా, మూడో ప్రపంచ నాటక సంఘం అధ్యక్షుడిగా పని చేశారు. రాష్ట్రంలో నాటకాలకు వినోదం పన్ను రద్దు చేయించారు. నాటక బృందాలు ఒక చార్జీతోనే దేశంలో ఏ మూలకైనా రైలులో వెళ్లి రావడానికి కృషి చేసి, సాధించారు. రంగస్థల అభివృద్ధికి 'నాట్యమిత్ర పథకం' ప్రవేశపెట్టారు. వృత్తి కళాకారులకోసం 1971లో ఆంధ్రప్రదేశ్ రంగస్థల కళాకారుల సంఘాన్ని ఏర్పాటుచేయించారు. తనకున్న కొద్దిపాటి ఆస్తిలోనే రూ.75 వేలను నాటకరంగ అభివృద్ధికి కార్పస్ ఫండ్‌గా ఇచ్చారు. ఏఆర్. కృషికి కృషికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 'పద్మభూషణ్'తో సత్కరించింది. ఆయన 1992లో మృతిచెందారు. నాటక రంగంలో ఒకే వ్యక్తి ఇంతటి విజయాలను సాధించడం అపూర్వం.

రంగస్థల కళలో 'పద్మశ్రీ' గోపాలరావు

ఏఆర్. కృష్ణ జాతీయ పురస్కారాన్ని స్వీకరించనున్న యడ్ల గోపాలరావు సొంతూరు విజయనగరం జిల్లా. 1950లో జన్మించారు. 14 ఏళ్ల వయసులో 'దేశం కోసం' నాటకంతో అరంగేట్రం చేశారు. అప్పట్నుంచి అలుపెరగని కళాసేవ చేశారు. నాటకానుభవం 59 ఏళ్లు ఉంటే అందులో 55 ఏళ్లపాటు ఆరువేల పౌరాణిక నాటక ప్రదర్శనలిచ్చారు.30 సాంఘిక నాటక, నాటిక ప్రదర్శనల్లో నటించారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, నారదుడు, నక్షత్రకుడు, హరిశ్చంద్రుడు, భవానీశంకరుడు పాత్రల్లో రాణించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశంలోని వివిధ ప్రముఖ నగరాల్లోనూ నాటక ప్రదర్శనలిచ్చి, అందరి మెప్పునూ పొందారు. 1982 నుంచి బాల భారతి నాటక కళాసమితిని స్థాపించి పరిషత్ పోటీలు, పద్యపఠన పోటీల్ని నిర్వహిస్తున్నారు. నాటకరంగంలో కృషికి గుర్తింపుగా అనేక అవార్డుల్ని అందుకున్నారు. 2016లో కందుకూరి విశిష్ట పురస్కారం, 2017లో బంగారు నంది, 2020లో కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ అవార్డు, 2023లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి వైఎస్సార్ జీవితకాల పురస్కారం సహా అనేక సత్కారాల్ని అందుకున్నారు.

మహా మాయగాడు



గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కృష్ణచైతన్య



గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవికి పుష్పగుచ్ఛం అందిస్తూ..



గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో..

- రెండు రాష్ట్రాల్లోనూ బాధితులు
- ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులకు టోకరా
- రూ.20 నుంచి రూ.30 లక్షల వరకు వసూలు
- టీడీపీ నాయకులతో చెట్టాపట్టాలు

గుంటూరు: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగులను మాయమాటలతో మోసగించే మోసకారి లీలలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. దాదాపు 57 మందికిపైగా నిలువునా ముంచేశాడు. బాధితుల నుంచి సుమారుగా రూ.20 లక్షల నుంచి మొదలై, రూ.30లక్షలకు పైగా తీసుకునే వాడు. ఇప్పటికే కోట్ల రూపాయలు వసూలు చేసిన పలకలూరు రోడ్డుకి చెందిన సూరాబత్తుని కృష్ణచైతన్య తొలినాళ్ల నుంచి టీడీపీకి కార్యకర్తగానే వ్యవహరించారు. విష్ణు ఓవర్సీస్ కన్సల్టెన్సీని నెలకొల్పాడు. ఈ క్రమంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని, విదేశాలకు పంపిస్తామని మోసపూరితమైన ప్రకటనలతో గుప్పించాడు. దీంతో చాలా మంది నిరుద్యోగులు అతని ప్రకటనలకు ఆకర్షితులయ్యారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని, పాస్‌పోర్టు, వీసా వంటి అవసరాలు నిమిత్తం పెద్దమొత్తంలో వసూలు చేసినట్లు తెలిసింది. గుంటూరు ఇన్నర్‌రింగ్ రోడ్డుకి చెందిన శ్యాం వద్ద రూ.24 లక్షలు, పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన నవీన్ వద్ద రూ.13 లక్షలు, గుంటూరు గోరంట్లకు చెందిన అనీల్‌కుమార్ వద్ద రూ.16 లక్షలు తీసుకున్నాడు. ఈ ముగ్గురిని కూడా కెనడా దేశం పంపిస్తామని తీసుకున్నాడని బాధితులు తెలిపారు. ఇక గుంటూరు పాతగుంటూరుకి చెందిన నాగార్జున వద్ద రూ.23 లక్షలు తీసుకుని, మూడు చెరువుల నీళ్లు తాగించాడని బాధితుని బంధువుల తెలిపారు. నకిలీ ఉద్యోగాల నియామక పత్రాలతో మరింతగా బురిడీ కొట్టించడంలో మంచి నేర్పరి కూడా. మొదట్నుంచి అతను టీడీపీలో కీలకంగా వ్యవహరించాడు. ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు , గళ్లా మాధవి , నసీర్ అహ్మద్, ఎమ్మెల్యే గళ్లా మాధవి భర్త గళ్లా రామచంద్రరావుతో దిగిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి.

నాకు సంబంధం లేదు

నిరుద్యోగులను నిలువునా మోసగించిన వ్యక్తితో తనకేమి సంబంధంలేదని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. గుంటూరు అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఆ సంస్థ ప్రారంభోత్సవానికి తన అనచరుల ద్వారా నిర్వాహకులు ఆహ్వానిస్తే వెళ్లానని తెలిపారు. ఆ సంస్థ కార్యకలపాలు, నిర్వాహకులతో తనకేం సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు.

పసికందు కిడ్నాప్

- గంటల వ్యవధిలో ఛేదించిన పోలీసులు
- జీజీహెచ్ నుంచి ఒక్క రోజు బాబును ఎత్తుకెళ్లిన నిందితులు

పట్నంబజారు: ఒక్క రోజు చిన్నారిని అపహరించుకుని పోయిన ఘటన గుంటూరులో కలకలం సృష్టించింది. అయితే గంటల వ్యవధిలోనే పోలీసులు జాడ తెలుసుకుని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. గుంటూరు జీజీహెచ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. గుంటూరు రూరల్ మండలం గోరంట్ల గ్రామానికి చెందిన షేక్ నసీమాను ఈనెల 6వ తేదీ రాత్రి 10 గంటలకు కుటుంబ సభ్యులు డెలివరీ నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అదేరోజు రాత్రి ఒంటి గంట సమయంలో మగ బిడ్డ జన్మించాడు. 7వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో గుర్తుతెలియని మహిళ బాలింతరాలిగా నటిస్తూ ప్రసూతి వార్డులోకి ప్రవేశించింది. నసీమాతో మాటలు కలిపి శిశువును ముద్దాడుతూ బయటకు తీసుకొచ్చింది. అరగంట అయినప్పటికీ తిరిగి రాకపోవడంతో నసీమా తల్లిదండ్రులు, బంధువులకు విషయం తెలిపింది. పోలీసులకు సమాచారాన్ని ఇవ్వగా, ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేక బృందాలను రంగంలో దించారు. సీసీ పుటేజీల ఆధారంగా ఆటో నంబరు కనుగొన్న పోలీసులు ఆర్టీసీ బస్టాండ్ వద్ద పట్టుకున్నారు. ఇరువురు మహిళలు, ఒక మగవ్యక్తితోపాటు మరో వ్యక్తి కలిసి శిశువును తీసుకెళ్లారని ఆటోడ్రైవర్ పోలీసులకు తెలిపాడు. ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీపుటేజీ పరిశీలించిన పోలీసులు అచ్చంపేట మండలం కోనూరు గ్రామానికి చెందిన వ్యక్తులుగా దర్యాప్తులో నిర్ధారించారు. చింతపల్లి మంగమ్మ, ఆమె కుమార్తె బోరుగడ్డ శిరీష, ఆమె భర్త ప్రేమ్‌రాజులు పసికందును తీసుకెళ్లినట్లు గుర్తించారు. కోనూరు గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి చూడగా, శిశువు కనిపించడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. మూడు గంటల వ్యవధిలోనే పసికందు ఆచూకీ గుర్తించి క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. శిరీష పోలీసుల విచారణలో తాను కూడా ప్రసూతి వార్డులో బిడ్డకు జన్మనిచ్చానని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాల్సి ఉందని, నిందితులను విచారించిన అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గతనెల 20వ తేదీన బిరుదగల శిరీష అనే మహిళ ఆసుపత్రిలో చేరిందని, ఆమెకు పుట్టిన చిన్నారికి గుండెల్లో స్వల్ప ఇబ్బంది ఉండటంతో 25వ తేదీన మృతి చెందిందని తెలిపారు. చిన్నారిని అపహరించిన శిరీష ప్రసూతి వార్డులో చేరిందా.. లేదా? అనే అంశంపై పూర్తిస్థాయి విచారణలో తేలాల్సి ఉందని పేర్కొన్నారు.



బిడ్డను తీసుకువస్తున్న పోలీసులు, నర్సు చేతిలో పురిటి బిడ్డ, పక్కన నిందితులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

క్లుప్తంగా

పట్టభద్ర ఓటర్లుగా నమోదు చేసుకోండి



ఏపీ ఎన్జీఓ సంఘ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఘంటసాల శ్రీనివాసరావు

గుంటూరు మెడికల్: పట్టభద్రులైన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు అందరూ పట్టభద్ర ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని గుంటూరు జిల్లా ఎన్జీజీఓ సంఘ అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీవో హోంలో సోమవారం జరిగిన ఎన్జీజీవో ప్రతినిధుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులే కాదు వారి కుటుంబ సభ్యులు కూడా పట్టభద్రులుగా ఉన్నారన్నారు. వారిని కార్యక్రమంలో భాగస్వాములను చేసి, ఓటర్లుగా నమోదు చేసి ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. అన్ని శాఖల్లో ఉద్యోగులందరికీ ఈ విషయాన్ని తెలియజేయాలని ఆయా శాఖలోనే సంఘ నాయకులు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు అందరూ కూడా నవంబర్ 6 వరకు జరిగే ఈ ఓటర్ నమోదు కార్యక్రమం గురించి ఉద్యోగులను చైతన్యపరిచి ఓటరు నమోదు కార్యక్రమాన్ని జయప్రదంగా చేయాలన్నారు. ఎన్జీజీఓ హోమ్‌లో ఓటరు నమోదుకు సంబంధించిన సదుపాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. నవంబర్ 6 వరకు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్ వారి కుటుంబ సభ్యులు ఈ కేంద్రం ద్వారా ఫారం 18ని పొందవచ్చన్నారు. సమావేశంలో జిల్లా ఎన్జీజీవో సంఘ కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటరెడ్డి, జిల్లా మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివజ్యోతి, నగర అధ్యక్షుడు ఎస్‌పీఎస్ సూరి, కార్యదర్శి కల్యాణ్ కుమార్, విజయ్‌బాబు, జిల్లా మహిళా విభాగం కన్వీనర్ కె.లక్ష్మీరమ్య, పట్టణ మహిళా విభాగం చైర్‌పర్సన్ పి.లక్ష్మి ప్రసన్న, బి.శైలజ, కోటమ్మ, పద్మజ, సునీత, పలు శాఖల నుంచి వచ్చిన ఎన్జీజీవో నాయకులు పాల్గొన్నారు.

కలసికట్టుగా కూటమిని మట్టి కరిపిద్దాం



సమావేశంలో మాటాడుతున్న మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

పట్నంబజారు: '' మన అందరిది ఒకటే బాట.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలను అస్త్రంలా చేసుకుని.. దుర్మార్గంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవా''లని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం మంగళగిరి నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీల్ని బలోపేతం చేసే దిశగా ముందుకు సాగాలని తెలిపారు. అనుబంధ విభాగాల్ని సైతం పూర్తిస్థాయిలో పార్టీ కోసం బాధ్యతగా పనిచేసేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అత్యంత వేగంగా ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని, ఉచిత ఇసుక విషయంలో అట్టర్ ఫెయిల్యూర్ అయ్యారని తెలిపారు. మద్యం అంశంలో కూడా రూ. 30లక్షల వరకు టెండర్లు వచ్చిన వారు కట్టాలని భయపెడుతున్న పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. అన్ని వర్గాలకు, ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత కల్పించేలా కమిటీలు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. చిన్నాచితక భేదాల్ని పక్కనబెట్టి పార్టీ పటిష్టతే ధ్యేయంగా ప్రతి ఒక్కరం ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కమిటీల ఏర్పాటులో పూర్తిస్థాయిలో కార్యకర్తలు, ప్రజల మనోభావాల్ని పరిగణలోకి తీసుకుని ముందుకు సాగేలా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

ఎగిసిపడే అలలకు తీసిపోరు మన కార్యకర్తలు : మోదుగుల

కడలిలో ఎగిసిపడుతున్న అలలకు తీసిపోని ధైర్యశాలులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలని గుంటూరు, నర్సరావుపేట పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. కూటమి నేతలు బెదిరింపులు, దాడులు, అక్రమ కేసులకు ఏ మాత్రం భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. కచ్చితంగా నిర్మాణత్మకమైన కమిటీని ఏర్పాటు చేసుకోవటంతో పాటు, అన్ని విభాగాల్ని మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. ఇప్పుడు ఎన్నికలు పెట్టినా.. చంద్రబాబు తుక్కుతుక్కుగా ఓడిపోవటం తథ్యమని తెలిపారు. ప్రతి ఒక్కరూ అచెంచలమైన ఆత్మవిశ్వాసంతో తిరిగి 2029 ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తెచ్చుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ మరుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రజలకు మనం ఉన్నామనే ధైర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ పదవుల నియామకాల్లో ప్రతి ఒక్కరి అభిప్రాయానికి విలువ ఉంటుందని తెలిపారు. పార్టీ నేత గంజి చిరంజీవి మాట్లాడుతూ అధికారం ఉన్నా.. లేకపోయినా వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని పేర్కొన్నారు. సీఎం పీఠం కోసం అడ్డదారులు తొక్కే మనస్తత్వం వైఎస్. జగన్‌కు లేదని తెలిపారు. అనంతరం పార్టీ నేతలు అంతర్గతంగా పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

దాచేపల్లి: నడికుడి రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు సోమవారం గుర్తించారు. రెండవ నంబర్ ప్లాట్ ఫారం పట్టాలపై సుమారుగా 50 సంవత్సరాల వయసున్నన్న వ్యక్తి మృతిచెందినట్లుగా పోలీసులు గుర్తించారు. తెలుపు రంగు పుల్‌చేతుల చొక్కా, బ్లూకలర్ ప్యాంట్, కుడిచేతి ఉంగరం వేలికి వెంకటేశ్వరస్వామి బొమ్మకలిగిన వెండి ఉంగరం ధరించుకుని ఉన్నాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వ్యక్తులు పూర్తి వివరాల కోసం నడికుడి జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని చెప్పారు. రైలుకింద పడటం వలనే మృతిచెందినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మోస పోయాం.. ఆదుకోండి !

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పోలీసులకు బాధితుల మొర



బాధితుల సమస్య అలకిస్తున్న డీఎస్పీ

నగరంపాలెం: వ్యాపారంలో వాటా ఇస్తామని మోసగించారని ఒకరూ, రైతుల లావాదేవీలతో సంబంధం లేకపోయినా తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్నారని మరొకరూ.. ఇలా పలువురు బాధితులు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విన్నవించారు. బాధితుల నుంచి అర్జీలను డీఎస్పీలు స్వీకరించారు. బాధితుల మొర ఆలకించారు. కార్యక్రమంలో డీఎస్పీలు శివాజీరాజు (సీసీఎస్), సుబ్బారావు (మహిళా పీఎస్), రమేష్ (ట్రాఫిక్) పాల్గొన్నారు.

వ్యాపారంలో వాటా పేరిట మోసం

గతంలో రామనామ క్షేత్రం వద్ద బంధువుల ఇంట్లో అద్దెకు ఉన్నా. వారు చుట్టుగుంట వద్ద కమర్షియల్ వ్యాపారం చేస్తున్నట్లు చెప్పారు. అందులో వాటా ఇస్తామని, నా దగ్గర రూ.4 లక్షలు తీసుకున్నారు. అక్కడ వ్యాపారం చేయకపోవడంతో డబ్బులు అడిగాను. ఇవ్వకపోగా బెదిరించారు. దీంతో మనస్తాపం చెందిన జూన్ 16న బాత్రూం కడిగే యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డా. జీజీహెచ్‌లో, ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నా. ఇటీవలే ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పని చేయలేకపోతున్నా. అవతలి వ్యక్తులను విచారించి, న్యాయం చేయాలి.

– బొమ్మిరెడ్డి రామకృష్ణ, రామనామ క్షేత్రం, గుంటూరు

కంపెనీలో పెట్టుబడి పేరిట మోసం

హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో పెట్టుబడి రూపేణా లక్ష చెల్లించాం. నగదుకు ష్యూరిటీగా చౌటుప్పల్‌లో 100 గజాల స్థలం రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. ప్రతి వారం రూ.3,600 చొప్పున 50 వారాల్లో అసలు, వడ్డీ సహా చెల్లిస్తామని తెలిపారు. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ చేసిన స్థలాన్ని తిరిగి అప్పగించాల్సి ఉంటుందని కంపెనీ నిర్వాహకులు, ఏజెంట్లు చెప్పారు. దీంతో మే, జూలై నెలల్లో సుమారు 300 మంది డబ్బులు చెల్లించాం. ఇలా దాదాపు రూ.3 కోట్లు వసూలు చేశారు. ప్రస్తుతం చెల్లించిన డబ్బులకు రిజిస్ట్రేషన్ చేయమని అడిగితే సమాధానంలేదు. ఇటీవల డీపీఓలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. మోసగించిన వారిపై చర్యలు తీసుకోవాలి.

–ఐ.మాణిక్యరావు, సైదా (పెదనందిపాడు).

తక్కువకే కొట్టేశాడు

చల్లవారిపాలెంలో 81 గజాల స్థలంలో మూడు అంతస్తుల ఇల్లు నిర్మించాం. అప్పులు భారంతో బ్యాంక్‌లో రుణం తీసుకున్నాం. దాన్ని చెల్లించేందుకు కూడా ఇబ్బందులకు గురవుతుండగా ఓ కానిస్టేబుల్ పరిచమయ్యారు. రుణం మొత్తం చెల్లిస్తానని చెప్పి, దఫాల వారీగా తనఖా రిజిస్ట్రేషన్లు చేయించి ఇల్లు కాజేశాడు. ఇటీవల ఇంటి నుంచి గెంటేయడంతో ప్రస్తుతం ప్రకాశం జిల్లా కనిగిరి వద్ద ఉంటున్నాం. సుమారు రూ.80 లక్షలు ఖరీదు చేసే ఇంటిని అతి తక్కువ ధరకు చేజిక్కించుకున్నాడు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. న్యాయం చేయడం లేదు.

– యడవల్లి జానకీరాములు, ధనలక్ష్మి, కనిగిరి, ప్రకాశం జిల్లా

రైతుల లావాదేవీలతో సంబంధం లేదు

పత్తి మిల్లు నిర్వహిస్తుంటాను. అయితే ఓ కార్పొరేషన్ యజమాని ఫిరంగిపురం రైతులకు నగదు చెల్లించలేదు. అంతేగాక నాపై మేడికొండూరు, ప్రత్తిపాడు పీఎస్‌ల్లో తప్పుడు కేసులు పెట్టించాడు. రైతులకు అతను డబ్బులు చెల్లించకుండా నా వద్దకు పంపించాడు. ఈ క్రమంలో వారందరూ కలిసి చంద్రమౌళీనగర్‌లోని నా ఇంటి వద్ద గొడవకు దిగారు. రైతుల్ని నేను మోసం చేయలేదు. అతనే మోసగించి నాపై మోపాడు. రైతుల లావాదేవీలతో ఎటువంటి సంబంధంలేదు. అదిగాక బెదిరిస్తున్నారు. న్యాయం చేయాలి.

– నేరెళ్ల వెంకటహరిప్రసాద్‌రావు, చంద్రమౌళీనగర్.

నాటక రంగంలో ఆ నలుగురూ ట్రెండ్ సెట్టర్స్

నట దిగ్గజాల శతజయంతి సదస్సులో డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి



ఆచంట బాలాజీనాయుడుకు వెంకట్రామయ్య చౌదరి శత జయంతి స్మారక అవార్డు



వల్లూరు శివప్రసాద్‌కు కొడాలి గోపాలరావు అవార్డు



జరుగుల రామారావుకు కన్నెగంటి నాసరయ్య అవార్డు

తెనాలి: ప్రస్తుతం శతజయంతి ఉత్సవం జరుపుకుంటున్న నాటకరంగ దిగ్గజాలు వారి వారి ప్రక్రియల్లో ట్రెండ్ సెట్టర్స్‌గా నిలిచారని ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, అధ్యాపకుడు, ప్రయోక్త డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి అన్నారు. ప్రపంచయుద్ధం ముగిశాక 1921–30 దశాబ్దంలో 'హంగ్రీ థర్టీస్'లో జన్మించినవారు అటు గాంధీ, ఇటు మార్క్సిజం ప్రభావాలకు లోనుకుండా నాటక రచన, నటనతో తెలుగు నాటకాన్ని సుసంపన్నం చేశారని చెప్పారు. భావితరాలకు వారి స్ఫూర్తిని అందించడం అభినందనీయమని చెప్పారు. కళల కాణాచి–తెనాలి, వేద గంగోత్రి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న చతుర్థ పద్యనాటక, సాంఘిక నాటక, నాటికల పోటీలు, వీణా అవార్డ్–2024 సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజున జిల్లాకు చెందిన నాటకరంగ దిగ్గజాలు వల్లూరు వెంకట్రామయ్య చౌదరి, కొడాలి గోపాలరావు, కన్నెగంటి నాసరయ్య, బెల్లంకొండ రామదాసు శతజయంతి సదస్సును నిర్వహించారు. డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి అధ్యక్షత వహించారు. తొలుత మాయల ఫకీర్ ఫేం వల్లూరు వెంకట్రామయ్య చౌదరి గురించి నాటకరంగ పరిశోధకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు మాట్లాడారు. బాలనాగమ్మ నాటకంలో మాయలఫకీరు పాత్రలో నటించి ఆ నాటకాన్ని, పాత్రను దిక్కులు, చుక్కలు ఉన్నంతవరకు శాశ్వతముద్ర వేసిన మహానటుడు వెంకట్రామయ్య చౌదరిగా చెప్పారు. తెలుగులో అంతటి సుప్రసిద్ధమైన జానపద నాటకం మరొటి లేదన్నారు. శతాధికనాటక రచయిత కొడాలి గోపాలరావు గురించి, ఆయనపై పరిశోధన చేసిన వేల్పుల బుచ్చిబాబు మాట్లాడారు. మరుగున పడిన మహా రచయిత కొడాలి గోపాలరావు అని, నాటకానికి, సినిమాకు ఏమాత్రం తీసుపోనివిధంగా ఆయన జీవితం చిత్రమైన మలుపులు తిరిగిందన్నారు. ఆయన జీవితం, రచనలు పుస్తకరూపంగా తీసుకొస్తే, నేటితరానికి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. సాంఘిక నాటకాన్ని ఒక వెలుగు వెలిగించిన కన్నెగంటి నార సరయ్య జీవితవిశేషాలపై నాటకరంగ విశ్లేషకుడు అంబటి మురళీకృష్ణ మాట్లాడారు. జాతీయభావాలు కలిగిన నాసరయ్య చిన్నవయసులోనే బుర్రకథతో స్వరాజ్య ఉద్యమానికి ఊపిరిలూదారని చెప్పారు. మరోవైపు తన కృషితో సాంఘిక నాటకానికి ఆదరణ పెరిగేలా చూశారని వివరించారు. ప్రముఖ నాటకరచయిత బెల్లంకొండ రామదాసుపై ప్రముఖ పాత్రికేయుడు రెంటాల జయదేవ మాట్లాడారు. పల్నాడుకు చెందిన రామదాసు భావకవిత్వం రాస్తూ నాటక రచనకు మళ్లినట్టు తెలిపారు. నయాగర కవుల్లో ఒకరుగా ప్రసిద్ధి చెందారని తెలిపారు. అనంతరం జరిగిన సభలో వల్లూరు వెంకట్రామయ్య చౌదరి శతజయంతి స్మారక అవార్డును ప్రముఖ రంగస్థల నటుడు ఆచంట బాలాజీనాయుడుకు, కొడాలి గోపాలరావు శతజయంతి స్మారక అవార్డును ప్రముఖ కథా, నాటక రచయిత వల్లూరు శివప్రసాద్, కన్నెగంటి నాసరయ్య శతజయంతి స్మారక అవార్డును నాటక రచయిత, నటుడు, దర్శకుడు జరుగుల రామారావు, బెల్లంకొండ రామదాసు శతజయంతి స్మారక అవార్డును హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రంగస్థల రచయిత జమ్మలమడక శశిమోహన్ బంధువుకు అందజేశారు. సభకు ముందు శ్రీదుర్గాభవాని నాట్యమండలి, తెనాలి వారిచే 'శ్రీకృష్ణ రాయబారం' పద్యనాటకాన్ని ప్రదర్శించారు. కళల కాణాచి వ్యవస్థాపకుడు, సినీరచయిత డాక్టర్ సాయి మాధవ్ బుర్రా స్వాగతం పలికారు. కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రి జయలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు. కళల కాణాచి ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్, కోశాధికారి దేవరపల్లి భవాని, ఉపాధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, వ్యవస్థాపక కార్యదర్శి షేక్ జానీ బాషా పర్యవేక్షించారు.

కౌలు రైతుల కష్టం కోసం ప్రత్యేక చట్టం

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చంనాయుడు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెం నాయుడు

గుంటూరు వెస్ట్ :రాష్ట్రంలో 80 నుంచి 90 శాతం భూములను కౌలు రైతులే సాగు చేస్తున్నారని, అయితే వారికి ఆశించిన స్థాయిలో లాభం రావడం లేదని, వారి హక్కుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చంనాయుడు చెప్పారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో మంత్రి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సాగుదారుల హక్కు చట్టం 2024 కు సంబంధించి ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలతో తొలి ప్రాంతీయ సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ 1956లో కౌలుదారుల చట్టం అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఆతరువాత 2011లో మరో చట్టం వచ్చిందని, అయితే ఈ చట్టం 2016 వరకు అమలు కాలేదని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలోనే ఈ చట్టాన్ని 0 నుంచి దాదాపు 40 శాతానికి పైగా కౌలు దారులకు ఉపయోగపడేలా అమలు చేశామన్నారు. భూమిలో కాయకష్టం చేసి పనిచేసే కౌలు రైతుకు జరిగే అన్యాయాలు ఈ నూతన చట్టంతో చాలా వరకు సమసి పోతాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో కౌలు రైతులు దారుణ నిర్లక్ష్యానికి గురయ్యారని పేర్కొన్నారు. ఈ నూతన చట్టం గ్రామసభలు నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించిన తరువాతే అమలులోకి తెస్తారన్నారు. ముఖ్యంగా రైతాంగం ఆధునిక వ్యవసాయ పరికరాలను మరింత పెంచుకుంటే వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయన్నారు. ఈ చట్టం ద్వారా భూ యజమానులకు ఎలాంటి నష్టం లేకుండా, కౌలు చేసే రైతులకు ఉపయోగం ఉండేలా రూపకల్పన చేశామన్నారు. వ్యవశాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయం చేసే రైతుకు ఫలం దక్కాలనే సిద్ధాంతంతో ఈ చట్టాలు రూపకల్పన చేశామని చెప్పారు. ఇటీవల కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు ఈ చట్టంపై ఆయనతో చర్చించడంతోపాటు, వివరాలు అందజేశామన్నారు. ఈ చట్టం ద్వారా భూమి సాగు చేసే రైతులకు కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ రూ. 6వేలు కూడా వారికే దక్కుతోందన్నారు. ఈ చట్టం ద్వారా భూ యజమానులు ఎటువంటి ఇబ్బందులు పడాల్సిన పని లేదన్నారు. బ్యాంకర్లు కూడా కౌలు రైతులకు మరిన్ని రుణాలు ఇచ్చేందుకు ఈ చట్టం దోహదపడుతోందని వివరించారు. అనంతరం ఐదు జిల్లాల నుంచి వచ్చిన రైతులు చట్టం అమలుపై రైతుల సమస్యలపైన పలు సూచనలు, ఇబ్బందులను మంత్రికి తెలిపారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు, అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తెనాలి శ్రావణ్‌కుమార్, గల్లా మాధవి, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పాల్గొన్నారు.

చర్చలో ఎమ్మెల్సీలకు దక్కని ఆహ్వానం

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందో, జిల్లా అధికార యంత్రాంగ విస్మరించిందో గానీ చర్చలో పాల్గొనడానికి శాసన మండలి సభ్యులకు ఆహ్వానం అందలేదు. ఏపీ సాగుదారుల హక్కుల చట్టం–2024పై శాసన సభ్యులు, ఉన్నతాధికారులతోపాటు ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల రైతులతో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం తొలి ప్రాంతీయ సమావేశం నిర్వహించింది. ఇందులో రైతులకు సంబంధించి కీలక చర్చ జరిగింది. నిత్యం రైతు సమస్యల పైనా, ముఖ్యంగా కౌలుదారుల హక్కుల కోసం పనిచేసే ఎమ్మెల్సీలు కె.ఎస్. లక్ష్మణరావుతోపాటు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నంలకు ఆహ్వానం అందలేదు. దీనిపై సాక్షి సదరు ఎమ్మెల్సీలను వివరణ కోరగా తమకు ఎటువంటి ఆహ్వానం లేదని చెప్పారు. కౌలు రైతుల హక్కుల సాధన కోసం పనిచేసే తమను విస్మరించి ఏం చర్చ నిర్వహించారని ప్రశ్నించారు. అయితే, ఈ చర్చలో ఎక్కువగా టీడీపీ భజనే జరిగిందని, కొందరు రైతులు పేర్కొన్నారు.

సొంత పార్టీ శాసనసభ్యులు డుమ్మా.

ఇంత ముఖ్యమైన సమావేశానికి జిల్లాలోని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్‌లకు ఆహ్వానం పంపినా హాజరుకాలేదు. కౌలు రైతుల్లో అధిక శాతం దళితులే ఉంటారు. ఆ కోటాలో ఎమ్మెల్యే అయిన రామాంజనేయులు వారి సమస్యలపై చర్చించేందుకు రావకపోవడం కొందరిని ఆగ్రహానికి గురి చేసింది. చట్టం ఎవరికీ చుట్టం కాదు.. తమకు కావాల్సిన వారిని పిలుచుకుని, పార్టీ ముద్రతో మరికొందరు ముఖ్యులను విస్మరించడం తగదని కొందరు అధికారులంటున్నారు. ఏపీ సాగుదారుల హక్కుల చట్టం–2024ను త్వరలోనే క్యాబినెట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేస్తామని మంత్రి కె.అచ్చెన్నాయుడు ప్రకటించారు.

117 జీవో రద్దుపై హామీని మరిచిన ప్రభుత్వం



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రాథమిక పాఠశాలల భవితవ్యాన్ని నిర్వీర్యం చేస్తున్న 117 జీవోను అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం విస్మరించడం తగదని ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్. జోసఫ్ సుధీర్‌బాబు పేర్కొన్నారు. కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో సోమవారం జిల్లా ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. జోసఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ ఎంతో కీలకమైన జీవో 117 రద్దు గురించి ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరించడం ఎంత మాత్రం సరికాదని విమర్శించారు. జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు మాట్లాడుతూ వేతన సవరణపై గత ప్రభుత్వం వేసిన పీఆర్సీ కమిటీని రద్దు చేసిన ప్రభుత్వం నూతన కమిటీని ఏర్పాటు చేయలేదని తెలిపారు. పాత పీఆర్సీ గడువు దాటి ఏడాది గడిచిందన్నారు. తక్షణమే పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి నుంచి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2022 ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్న ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను విడుదల చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. న్యాయబద్ధమైన డిమాండ్లను నెరవేర్చని పక్షంలో ఎస్టీయూ తరఫున భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. జిల్లా గౌరవాధ్యక్షుడు ఏవీ ప్రసాద్‌బాబు, రాష్ట్ర కౌన్సిలర్ డీఏ జోసఫ్, షేక్ బాజీ, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వై. శ్యాంబాబు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల పరిష్కారం వేగంగా జరగాలని జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒక శాఖ నుంచి మరో శాఖకు పంపే అర్జీలు సకాలంలో చేయడం లేదని, త్వరగా పంపే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం మొత్తం ఒకేచోటకు చేరడం అంటే అర్థం చేసుకోవాలని తెలిపారు. ఒకే అర్జీ పరిష్కారం కోసం ప్రజల్ని పదే పదే తిప్పుకోకుండా చూడాలని ఆయన సూచించారు. పరిష్కారానికి అవకాశంలేని వాటిని వివరించి తెలపాలని చెప్పారు. అనంతరం వచ్చిన 160 అర్జీలను జేసీతోపాటు అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా అధికారులు పరిశీలించారు.

టిడ్కో ఇంటికి రూ.3 లక్షలు కట్టమంటున్నారు



నేను, నా భార్య వికలాంగులం. మాకు ఇటీవల టిడ్కో ఇల్లు మంజూరయ్యింది. వెంటనే రూ.3 లక్షలు కడితే నే వస్తుందని చెబుతున్నారు. ఏ పని చేయలేని మేము అంత మొత్తం కట్టలేం. ప్రభుత్వం గానీ, దాతలు గానీ ముందుకు వచ్చి ఆదుకోవాలని ప్రార్థిస్తున్నాం.

– ఎం.అనిల్ కుమార్ దంపతులు, గుంటూరు

నా బిడ్డకు పెన్షన్ ఇప్పించండి



నా బిడ్డ వయస్సు ఇప్పటికి తొమ్మిది సంవత్సరాలు. పుట్టినప్పటి నుంచి మానసికంగా, శారీరకంగా వికలాంగుడు. నేను కూలీ పని చేసుకుని జీవిస్తుంటాను. బిడ్డ బతుకు భారమయ్యింది. వికలాంగుల పెన్షన్ ఇప్పిస్తే కొంత ఇబ్బంది తీరుతుంది.

–బిడ్డతో అల్లాబక్ష్ నంబూరు

నిరుద్యోగ భృతి అమల్లో ప్రభుత్వం విఫలం

గుంటూరు ఎడ్యుకేషన్: నిరుద్యోగ భృతిని అమలుపర్చడంలో ప్రభుత్వం విఫలమైందని గుంటూరు–కృష్ణా పట్టభద్రుల నియోజకవర్గానికి స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లగడపాటి వేణుగోపాల్ విమర్శించారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో సోమవారం ఆయన పట్టభద్రుల సమస్యల పరిష్కారంపై మేనిఫెస్టో విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ శాసనమండలి ఏర్పడినప్పటి నుంచి పట్టభద్రుల సమస్యల్ని ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. పట్టభద్రులకు ఉద్యోగావకాశాల కల్పన, నిరుద్యోగ భృతి మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మధ్యతరగతి రైతు కుటుంబం నుంచి వచ్చిన తాను 36 ఏళ్లపాటు అధ్యాపకునిగా సేవలందించిన అనుభవంతో పట్టభద్రులతో పాటు విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదుకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర అధ్యాపకుడు అంజయ్య, బీసీ సంఘ నాయకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.